ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 24.06.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఎస్ఐఆర్ అంశంలో పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సర్ పై ఈ రోజు టీపీసీసీ ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్ నిర్వహించారు.
2. తుంగభద్ర జలాలకు సంబంధించి తెలంగాణ హక్కులను పరిరక్షించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ శాసన సభా పక్ష ఉప నేత హరీష్ రావు లేఖ రాశారు.
3. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ రానున్న ఏడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

----------------------------

**గవర్నర్**

హైదరాబాద్ లోని లోక్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏక్ పేడ్ - మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఉదయం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మొక్క నాటారు. గత విద్యా సంవత్సరం 10 వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో భారత్ సేవాశ్రమ సంఘ్ సౌజన్యంతో లోక్ భవన్ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంను సందర్శించిన గవర్నర్ .. చిన్నారులకు నోట్ పుస్తకాలు అందజేశారు.

డెస్క్

---------------------------------

**ఎస్ఐఆర్**

రేపటినుంచి రాష్ట్రంలో ప్రారంభమవుతోన్న ఎస్ఐఆర్ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జూమ్ సమావేశం జరిగింది. ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నేతలు కొందరు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మందలించారు. సర్ సరిగా అమలు కాకపోతే పేదల ఆధార్, రేషన్ కార్డులు పోతాయని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఓటరు హక్కు కాపాడాలని మీనాక్షి నటరాజన్ పిలుపిచ్చారు.

డెస్క్

----------------------------

**హరీష్ లెటర్**

తుంగభద్ర జలాలకు సంబంధించి తెలంగాణ హక్కులను పరిరక్షించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ శాసన సభా పక్ష ఉప నేత హరీశ్ రావు లేఖ రాశారు. కర్ణాటక ప్రభుత్వం సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ అనుమతులు లేకుండా తుంగభద్రపై కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు అక్రమంగా నిర్మిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకు రావాల్సిన నీటి ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయని లేఖలో హరీష్ రావు హెచ్చరించారు. కురిడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు.

డెస్క్

--------------------------

**ఢిల్లీ మంత్రులు**

తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వినతి పత్రాల రూపంలో వివరించారు. కేంద్ర ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, తెలంగాణలో 152 లక్షల టన్నులకు పైగా ధాన్యం సేకరించామని, అందుకు తగినట్లు కేంద్రం కొనుగోళ్లు పెంచాలని కోరారు. కేంద్రం లక్ష్యాలు తక్కువగా నిర్ణయించడంతో గత మూడు సీజన్లలో రాష్ట్ర ఖజానాపై 16వేల 446 కోట్ల రూపాయల అదనపు భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి, క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని, పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై 25 శాతం పరిమితి తొలగించాలని కోరారు.

డెస్క్

----------------------------

**అమెరికా**

అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని యు.ఎస్. కాన్సులేట్‌లో నిర్వహించిన 'ఫ్రీడమ్ 250' వేడుకల్లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌కు డెవలప్‌మెంట్ సెంటర్ ఇస్తే ప్రపంచాన్ని నడిపించే గ్లోబల్ సీఈఓలను అందిస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ-అమెరికా భాగస్వామ్యం ఐటీ దాటి ఏఐ, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ రంగాలకు విస్తరిస్తోందని వెల్లడించారు. యు.ఎస్. కాన్సులేట్ సమీపంలోని రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని నిర్ణయించినట్లు విక్రమార్క గుర్తుచేశారు.

డెస్క్

----------------------------

**వెంకయ్య బుక్**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు 77వ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో 'వెంకయ్య నాయకుడు' పుస్తక ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన ఈ గ్రంథాన్ని జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్, క్రీడా దిగ్గజం పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. సామాన్య రైతు కుటుంబం నుండి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవి వరకు వెంకయ్య నాయుడు సాగించిన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అందరూ కొనియాడారు.

**పీటీసీ - హైదరాబాద్**

--------------------------------

**సీతక్క**

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ప్రజాభవన్‌లో నిన్న రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 1లక్షా 35వేల మంది సిబ్బంది పనిచేస్తుండగా.. ఏటా 34 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చవుతున్నా గ్రామాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**డెస్క్**

--------------------------

**పోస్టులు**

హైదరాబాద్ లోని సనత్‌నగర్ టిమ్స్ లో 184 ఒప్పంద పోస్టుల భర్తీకి మూడు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఇందులో 31 మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులు, 122 టెక్నికల్, అలైడ్ హెల్త్, అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు, 31 సపోర్ట్, ఇంజినీరింగ్, సెక్యూరిటీ, లీగల్, పీఆర్ తదితర పోస్టులు ఉన్నాయి. మెడికల్ ఫ్యాకల్టీలో 5 ప్రొఫెసర్లు, రెండు అసోసియేట్ ప్రొఫెసర్లు, 24 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు జులై 6 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

**డెస్క్**

-----------------------------

**కోడెలు**

రైతులు రాజన్న కోడెలను సంరక్షిస్తూ వాటితో వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో రైతులకు ఉచితంగా కోడెల పంపిణీని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, రాజన్న ఆలయ ఈవో రమాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,...

**బైట్ - ఆది శ్రీనివాస్**

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------------

**మాదక ద్రవ్యాలు**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ జిల్లా దుర్శెడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**బైట్ - గౌస్ ఆలం**

**పీటీసీ – కరీంనగర్**

----------------------------------

**అడ్మిషన్లు**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు పలు ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపునకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ లేదా టోల్‌ఫ్రీ నంబర్ 18005990101లో సంప్రదించవచ్చు.

**పీఎస్**

-----------------------------------

**ఫైర్ సేఫ్టీ**

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్ ఖాజా కరీముల్లా ఆధ్వర్యంలో మాదాపూర్, కొండాపూర్‌లోని వాణిజ్య సంస్థలు, వసతి గ్రుహాల్లో అగ్ని సురక్షా తనిఖీలు నిర్వహించారు. మాదాపూర్‌లోని స్కై100 కిచెన్ అండ్ బార్, కొండాపూర్‌లోని వెంకటేశ్వర కోలివింగ్ పీజీ హాస్టల్‌లో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో లేవని తనిఖీల్లో తేలింది. నిర్వాహకులపై ఫైర్ సర్వీసెస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

**పీఎస్**

------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలోని  పలు జిల్లాల్లో అక్కడక్కడ రానున్న ఏడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. ఈరోజు, రేపు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండతో సహా 31 జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**పీఎస్**

---------------------------

**అంతర్జాతీయ దౌత్య రంగ మహిళా దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ దౌత్య రంగ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా దౌత్యం, అంతర్జాతీయ సంబంధాలు, శాంతి చర్చలలో మహిళలు చేస్తున్న అసమానమైన సేవలను గుర్తించి, వారిని గౌరవించడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.  ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 2022లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది.  పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న దౌత్య, అంతర్జాతీయ సంబంధాల రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం.

**జీఎస్**

---------------------------

**పాలన**

ప్రజా సమస్యలు పరిష్కరించి. పాలనలో వేగం పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టిందని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ గౌరవ్ ఉప్పల్  అన్నారు. కార్యక్రమం అమలు తీరు పరిశీలించేందుకు నల్లగొండ జిల్లాలో ఆయన పర్యటించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో  కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------

**తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల**

పెద్దపల్లి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి తెలిపారు. ఈ పాఠశాలల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించేందుకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే స్థల పరిశీలన చేపట్టినట్లు పేర్కొన్నారు.

**పీటీసీ - పెద్దపల్లి**

-----------------------------

**జాబ్ మేళా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేపు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వ హిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------

**సస్పెండ్**

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీజీ హెడ్ మాస్టర్ గా, జిల్లా విద్యాశాఖలో ఫైనాన్స్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న దేవాజీని విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ మదన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో

పాటు పిఎంశ్రీ నిధులు దుర్వినియోగం చేసిన నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

--------------------------------

**పోలీసులు**

పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు డ్యూటీ మీట్ అత్యుత్తమ వేదిక అని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో 3వ జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్–2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ... నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి కీలక విధుల్లో పోలీసులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------------------